4 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
శనివారం 9 మార్చి 2024
www.ntnews.com



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# ప్రజాస్వామ్యానికే ప్రమాదమా?

**ఈ ఎన్నికల్లో తామే అధికారంలోకి వస్తామని ప్రతి రాజకీయ పక్షం ప్రకటించడం అత్యంత సహజం. తమ పార్టీ శ్రేణుల్లో ఆత్మవిశ్వాసం కలిగించే విధంగా, ప్రత్యర్థి పార్టీ ఆత్మవిశ్వాసం దెబ్బతీసే విధంగా ఎన్నికల ముందు ప్రతి రాజకీయ పార్టీ ప్రకటనలు చేస్తుంటాయి. దీనిలో భాగంగానే ఈ సారి సొంతంగా 370 స్థానాల్లో విజయం సాధిస్తామని, మిత్రపక్షాలతో కలిపి 400 స్థానాల్లో గెలుస్తామని బీజేపీ ప్రకటించింది. అయితే బీజేపీ తన లక్ష్యాలను ప్రకటిస్తూ యుద్ధం ప్రారంభానికి ముందే వైరి పక్షాలను చెల్లాచెదురు చేస్తూ భయపెడుతున్నది. ఎన్నికల సమయంలో భారీ లక్ష్యాలతో ప్రత్యర్థులను వణికించడం సహజమే.**

**కానీ, ఈ సారి చిత్రంగా వైరి పక్షాలు తమను తామే భయపెట్టుకుంటున్నాయి. ఎన్నికలు జరుగుతుంటే అధికార పక్షం గెలుస్తుందా? ఓడిపోతుందా? అని చర్చ జరుగుతుంది. కానీ, ఇప్పుడు ప్రధాని మోదీ చెప్పినట్టు మిత్రపక్షాలతో కలిపి బీజేపీకి 400 సీట్లు వస్తాయా? లేదా? అనే చర్చ జరుగుతుండటం గమనార్హం. తమపై విశ్వాసం కోల్పోయిన విపక్షాలు.. బయటకు చెప్పకపోయినా మూడోసారి కూడా తామే గెలుస్తామని బీజేపీ చేస్తున్న ప్రచార మాయలో పడిపోయాయి. సీట్ల సంఖ్య చెప్పి బీజేపీ భయపెడితే, విపక్షాలు సైతం తమను తాము భయపెట్టుకుంటున్నాయి.**



బుద్ధా మురళి



ఈ సారి బీజేపీ గెలిస్తే దేశంలో ప్రజాస్వామ్యం ఉండదు, రాజ్యాంగం ఉండదు, ఎవరికీ హక్కులు ఉండవనే ప్రచారాన్ని విపక్షాలు చేస్తున్నాయి. ఈ ప్రచారంతో విపక్షాలు ఆశిస్తున్న ప్రయోజనం ఏమిటో కానీ తమను తామే భయపెట్టుకోవడం వల్ల తాము నష్టపోవడమే కాదు, దేశానికి నష్టం కలిగిస్తున్నారు. సీట్ల సంఖ్య ఎంతైనా కావచ్చు, ఈ సారి కూడా బీజేపీ తిరిగి అధికారంలోకి రావడానికే ఎక్కువ అవకాశం ఉందనే ప్రచారం సాగుతున్నది. అప్పుడు విపక్షాలు ఏం చేస్తాయి? తాము భయపడిన విధంగా దేశంలో ప్రజాస్వామ్యం లేకుండా అధికార పక్షం చేస్తే మౌనంగా చూస్తూ ఉంటారా?

ఇంతకన్నా ఎక్కువ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన సందర్భం కూడా ఉంది. అప్పుడేమీ దేశంలో ప్రజాస్వామ్యం లేకుండాపోయిందా? మిత్రపక్షాలతో కలిసి 400 సీట్లు గెలుస్తామని మోదీ చెప్తున్నారు. కానీ, 1984లో కాంగ్రెస్ పార్టీ సొంతంగా 404 సీట్లు గెలిచింది. ప్రతిపక్ష హోదా కూడా ఎవరికీ దక్కలేదు. బీజేపీ రెండు సీట్లకే పరిమితమైంది. వాజపేయి లాంటి హేమాహేమీలు ఓడిపోయారు. అంతమాత్రాన దేశంలో ప్రజాస్వామ్యమే లేకుండా పోలేదు కదా. ఐదేండ్ల తర్వాత 1989లో జరిగిన ఎన్నికల్లో అదే కాంగ్రెస్ పార్టీ 197 సీట్లకు పరిమితమైంది. 1984లో గెలిచిన సీట్లలో కనీసం సగం సీట్లను కూడా కాంగ్రెస్ నిలుపుకోలేకపోయింది. రెండు సీట్లకు పరిమితమైన బీజేపీ నిరాశతో కృంగిపోలేదు. జెండా పీకేయలేదు. ఆత్మవిశ్వాసంతో నిలబడింది. వరుసగా రెండు సార్లు గెలిచింది. మూడోసారి గెలుస్తామని ధీమాగా అంటున్నది.

తమదే మళ్లీ అధికారమని బీజేపీ చెప్పుకోవడంలో తప్పు లేదు. కానీ, ఇవే చివరి ఎన్నికలు అన్నట్టు.. బీజేపీ మళ్లీ గెలిస్తే అసలు ప్రజాస్వామ్యానికే ముప్పు అన్నట్టు విపక్షాలు భయపెట్టడం వల్ల నష్టపోయేది వారే. కాంగ్రెస్ తప్పిదాలే బీజేపీకి రాజమార్గాన్ని చూపించాయి. ఇందిరాగాంధీ హయాంలో 'రోటీ, కపడా, ఔర్ మకాన్' అనేది ప్రజలను కదిలించిన గొప్ప నినాదం. దేశ ప్రజలు తిండికి కూడా నోచుకోని కాలమది. కాబట్టి ఆ నినాదం ప్రజలను కదిలించింది, ఓట్ల వర్షం కురిపించింది. ఇప్పుడా నినాదానికి కాలం చెల్లింది. కనీస అవసరాలకు అంత ఇబ్బందేమీ లేదు. ఈ రోజుల్లో హిందుత్వ, జాతీయ భావం, దేశభక్తి అనేవి చాలా తీవ్రమైన ప్రభావం చూపుతున్న అంశాలుగా మారిపోయాయి. కాంగ్రెస్ మొదటి నుంచి మైనారిటీ ఓటు బ్యాంకుపై దృష్టి సారిస్తే బీజేపీ మెజారిటీ వర్గాల ఓటు బ్యాంకుపై దృష్టి సారించి విజయం సాధించింది.

అలా అని 'మెజారిటీ ఓటు బ్యాంకు మొత్తాన్ని బీజేపీ తనవైపు తిప్పుకున్నది, ఇక ఆ పార్టీకి విజయం శాశ్వతం' అని కూడా చెప్పలేం. విపక్షాలకు ఇక దేశంలో చోటే లేదని ప్రచారం సాగుతున్న కాలంలో సైతం బీజేపీకి 2019 ఎన్నికల్లో ఓటు వేసిన వారు 37.36 శాతం మంది మాత్రమే. ఆ ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా ఓటు వేసినవారు 62 శాతం మంది. మిత్రపక్షాలతో కలిపినా బీజేపీకి 45 శాతం మంది అనుకూలంగా ఓటు వేస్తే.. 55 శాతం మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. 45 శాతం మంది అనుకూలంగా, 55 శాతం మంది వ్యతిరేకంగా ఓటు వేస్తున్నప్పటికీ 'బీజేపీ శాశ్వతంగా ఉంటుంది, విపక్షాలకు కాలం చెల్లింది' అన్నట్టుగా విపక్షాలే భయపడుతున్నాయి. దేశంలో ప్రజాస్వామ్య పునాదులు బలంగా ఉన్నాయి. ఏ పార్టీ ఎంత మెజారిటీతో గెలిచినా ప్రజాస్వామ్యానికి వచ్చిన ప్రమాదం ఏమీ లేదు. ఏ నినాదం శాశ్వతం కాదు. దేశభక్తి, హిందూ మతం, జాతీయ భావం ఏ పార్టీకో పరిమితం కాదు. బీజేపీ పుట్టకముందు నుంచి ఈ దేశ ప్రజల్లో దేశభక్తి ఉంది. మతం పట్ల విశ్వాసం ఉంది, భవిష్యత్తులోనూ ఉంటుంది. ఒక పార్టీకి ఒక నినాదం శాశ్వతంగా ఓట్లు తెచ్చిపెట్టదు.

**ఎన్నికల్లో అధికారంలో ఉన్న పార్టీకి సాధారణంగా కొంత వ్యతిరేకత ఉండడం సహజం. కానీ, వరుసగా రెండుసార్లు అధికారంలో ఉండి కూడా అత్యధిక సీట్లతో మళ్లీ అధికారంలోకి వస్తామని చెప్పుకోవడం బీజేపీ ఆత్మవిశ్వాసాన్ని తెలియజేస్తున్నది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి, ప్రజల తీర్పు కోరుతూ మరిన్ని ఎక్కువ సీట్లు గెలుస్తామనే ధీమాతో వెళ్తున్నారా? అంటే అలా ఏమీ కాదు. నిజానికి దేశవ్యాప్తంగా బీజేపీ తన ప్రచారంలో ఎక్కడా 'గతంలో ఇచ్చిన హామీలు అమలు చేశాం కాబట్టి మరోసారి మాకు అధికారం ఇవ్వాలి' అని కోరడం లేదు.**

ఎన్నికల ప్రచారంలో హామీలనేవి ప్రధానాంశంగా మారితే.. అది తమకు లాభం కన్నా నష్టమే ఎక్కువ చేస్తుందనే విషయం ఆ పార్టీకి బాగా తెలుసు. అందుకే వాటి జోలికి వెళ్లడం లేదు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు, అందరికీ సొంతిళ్లు, రైతుల ఆదాయం రెట్టింపు, నల్లధనం తీసుకువచ్చి ఒక్కొక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేయడం.. ఇవీ బీజేపీ ఇచ్చిన ప్రధానమైన హామీలు. పదేండ్ల పాలనలో 20 కోట్ల ఉద్యోగాలు ఇచ్చామని, రైతుల ఆదాయం రెట్టింపు చేశామని, అందరికీ ఇల్లు కట్టించామని బీజేపీ ఎక్కడా చెప్పడం లేదు. చెప్పదు కూడా.. అసలీ అంశాలే చర్చకు రాకుండా చూసుకుంటుంది. శ్రీరాముడు, అయోధ్య, హిందుత్వ, దేశభక్తి, పౌరసత్వం తదితర అంశాల ద్వారా బీజేపీ ప్రయోజనం పొందుతున్నది.

**బీహార్‌లో నితీష్ కుమార్ జతకట్టడం, ఒరిస్సాలో పట్నాయక్ స్నేహ హస్తం అందించడం, పొత్తు కోసం చంద్రబాబు చేస్తున్న తీవ్ర ప్రయత్నాలతో బీజేపీ మరింత ఆత్మవిశ్వాసాన్ని మూటగట్టుకుంటున్నది. అందుకే మళ్లీ గెలుస్తామని ప్రచారం చేసుకుంటున్నది. అదే సమయంలో కాంగ్రెస్ పరిస్థితి దారం తెగిన గాలి పటంలా మారడం బీజేపీకి కలిసొస్తున్న అంశం. ఈ పదేండ్ల కాలంలో ఉద్యోగ అవకాశాలు ఏ మేరకు పెరిగాయి? రైతుల ఆదాయం రెట్టింపు అయిందా? చెప్పినవి ఎంత వరకు చేశారు? అనే చర్చే లేదు. బీజేపీకి కావాల్సింది ఇదే.**

కాంగ్రెస్ పార్టీ నాయకురాలు సోనియాగాంధీనే రాజ్యసభ ద్వారా పార్లమెంట్‌కు వెళ్తున్నారంటేనే.. దేశంలో ఆ పార్టీ పరిస్థితి ఏమిటో తెలుస్తున్నది. యుద్ధరంగంలో ప్రత్యర్థిని చూసి రాజే తప్పుకొంటే సైన్యం ఏం పోరాడుతుంది.

జీవితంలో ఏదీ శాశ్వతం కాదు. విజయం శాశ్వతం కాదు, పరాజయం శాశ్వతం కాదు. వెలుగు శాశ్వతం కాదు, చీకటి శాశ్వతం కాదు. అన్నింటికీ కాలమే సమాధానం చెప్తుంది. గత ఎన్నికల్లో బీజేపీకి ఎదురులేకపోవచ్చు, రానున్న ఎన్నికల్లో తమదే విజయమని ఆ పార్టీ ప్రచారం చేసుకోవచ్చు. కానీ అది శాశ్వతం కాదు. 2024 చివరి ఎన్నికలు కావు. 2024 తర్వాత కూడా ఎన్నికలు ఉంటాయి. ఎన్నికలు వస్తూనే ఉంటాయి. ప్రజలు తమ తీర్పు ఇస్తూనే ఉంటారు.


---

**మార్పు రాగం అందుకున్న కాంగ్రెస్, బద్ధ శత్రువు అంటూనే చేతిలో చెయ్యేసి హస్తం పార్టీతో అక్రమ సంబంధం పెట్టుకున్న బీజేపీ ఎన్నికల వేళ ఒకటయ్యాయి. కొందరు రాజకీయ నిరుద్యోగులు, కుహనా మేధావులు ఆ పార్టీలకు జతకలిశారు. వారంతా కలిసి అబద్ధాలే ఎజెండాగా నీతి లేని పోరాటం చేశారు. వాళ్ల మాయమాటలను నమ్మిన ప్రజలు ఓట్లేసి అందలం ఎక్కించారు. అయితే, వారి అసలు బుద్ధి ఇప్పుడు బయటపడింది. కొత్త ప్రభుత్వం కొలువై వంద రోజులు కూడా గడవకముందే 'నిండా మునిగినం' అని ప్రజలు బాధపడుతున్నారు. 'ఓటేసి మోసపోయినం, గోసపడుతున్నం' అని పశ్చాత్తాపపడుతున్నారు.**

# ఎటు పోతున్నది పాలన?



గోగుల రవీందర్‌రెడ్డి
95022 52229



మార్పు మంత్రం జపించిన నాటి కుహనా మేధావులు ఇప్పుడెందుకు ప్రశ్నించడం లేదు. సర్వరోగ నివారిణి జిందా తిలిస్మాత్ అన్నట్టు.. 'అన్నిటికీ గడువు డిసెంబర్ తొమ్మిదో తారీఖు' అని నాటి పీసీసీ అధ్యక్షుడు, నేటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా చెప్పారు. తొమ్మిదో తారీఖు ప్రజల జీవితాలను మార్చేస్తుందని ఢంకా బజాయించారు. ఆయనతో పాటు ఈ కుహనా మేధావులు కూడా రాష్ట్రమంతా ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చారు. వాళ్ల ఆశలు, కోరికలు ఫలించాయి. అధికారంలోకి వచ్చారు. అయితే నాడు కేసీఆర్‌పై, బీఆర్ఎస్ ప్రభుత్వంపై కోటిన్నొక్క అబద్ధాలు చెప్పి, ప్రజల మనసులో విషం నింపిన కుహనా మేధావులు నేడు ఎందుకో రేవంత్ సర్కార్‌ను ప్రశ్నించడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయడం లేదు. 'మీరు చెప్పిన డిసెంబర్ తొమ్మిదో తారీఖు దాటి మూడు నెలలు గడిచిపాయే' అని ఒక్కరూ సీఎం రేవంత్‌రెడ్డికి గుర్తు చేయడం లేదు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఆగమాగం అయితుండ్రు, గగ్గోలు పెడుతుండ్రు అని ఎవరూ చెప్పడం లేదు. రైతు భరోసా ఏమైంది, కనీసం రైతుబంధు అయినా సరిగ్గా ఇవ్వడం లేదు, అడిగితే చెప్పుతో కొడ్తానని మంత్రులే అంటున్నారు అని ఒక్కరూ అడగటం లేదెందుకు? హస్తం సర్కార్‌ను ప్రశ్నించే దమ్ము ఈ కుహనా మేధావులకు లేదా? ప్రజల నేటి కష్టాలకు కుహనా మేధావులే కారణం. వారి మాయమాటలు నమ్మి మోసపోయిన ప్రజలు నేడు నిస్సహాయ స్థితిలో ఉన్నారు. ఎవరికీ చెప్పుకోలేక, ఎవరినీ అడగలేక వేదన పడుతున్నారు. అదానీ, మోదీ ద్వయం దేశానికి ప్రమాదకరమని రాహుల్‌గాంధీ చెప్తుంటే.. రేవంత్‌రెడ్డి అదానీకి స్వాగతం పలుకుతున్నారు. అయినా ఈ మేధావులు ప్రశ్నించడం లేదు. ఏం ఆశించి అబద్ధాల పునాదులపై కాంగ్రెస్‌ను గద్దెనెక్కించారో ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. లేదంటే ప్రజాగ్రహం చవిచూడాల్సి ఉంటుంది. కుహనా మేధావుల మోసాలను గుర్తు చేసుకుంటూ రాబోయే రోజుల్లో ప్రతి గ్రామం అట్టుడికిపోతుంది. ప్రజల ఆగ్రహజ్వాలల్లో వారంతా సమిధలు కాకతప్పదు.

మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకొస్తున్న మార్పులను చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. కేసీఆర్‌ను కించపరుస్తూ ఆయన ప్రయోగిస్తున్న పదజాలం గురించి తెలంగాణ ప్రజలు చర్చించుకుంటున్నారు. అబద్ధాలతోనే సర్కార్‌ను కూడా రేవంత్‌రెడ్డి నెట్టుకొస్తుండటం విడ్డూరం. తెలంగాణ తల్లి విగ్రహాన్ని కేసీఆర్ రూపొందించలేదనే విషయం అందరికీ తెలిసిందే. ఉద్యమ సమయంలో కవులు, కళాకారుల ఆలోచనల మేరకు రూపొందించినదే తెలంగాణ తల్లి విగ్రహం. తెలంగాణ ఆడబిడ్డలు నగలు వేసుకోకూడదా? ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు మాత్రమే నగలు ధరించాలా? మన చరిత్రను భవిష్యత్తు తరాలకు తెలిపేలా ఉన్న రాష్ట్ర ముద్రను తొలగిస్తామనడం హేయమైన చర్య. మన మూలాలను మరిచిపోవడం సరికాదు. వీటిపై మేధావి వర్గం స్పందించాలి.

**గతంలో కేసీఆర్‌ను, ఆయన కుటుంబ సభ్యులను కొంతమంది కావాలనే అవహేళన చేశారు. కేసీఆర్‌పై కోపంతో తెలంగాణను అవమానించారు. 'గడీల పాలన, దొరల పాలన' అంటూ ఇష్టం వచ్చినట్టు మాట్లాడారు. అయినప్పటికీ కేసీఆర్ ఎవరినీ నిందించలేదు. కక్షసాధింపులకు దిగలేదు. పంటి బిగువున బాధను భరిస్తూ ముందుకుసాగారు కేసీఆర్. అయితే నేడు పరిస్థితులు మారిపోయాయి. ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని, కాంగ్రెస్‌ను ప్రశ్నించినవారిపై కేసులు పెడుతున్నారు. బెదిరిస్తున్నారు. దాడులు చేస్తున్నారు. ఇదేనా మార్పు?**

మార్పు.. మార్పు అని నాడు ప్రచారం చేసినవాళ్లంతా నేడు పదవుల కోసం పాకులాడుతున్నారు. పాలకుల పంచన చేరి భజన చేస్తున్నారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నా వారికి పట్టడం లేదు. ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్న కుహనా మేధావులను ప్రజలే నిలువరించాలి. లేకపోతే ఆదర్శ తెలంగాణ ఆగమైపోతుంది. తెలంగాణ బిడ్డలారా తెలంగాణ ఉద్యమాన్ని ఆదర్శంగా తీసుకుని మరో ఉద్యమానికి సిద్ధం కావాల్సిన తరుణం వచ్చింది. ప్రజలు, మేధావులు తరలిరావాలి.. తెలంగాణను కాపాడుకోవాలి.

---

# టీచర్ల పాలిట శాపం టెట్



డాక్టర్ ఎస్.విజయ భాస్కర్
92908 26988




తెలంగాణలోని ప్రభుత్వ, పంచాయతీరాజ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పాలిట టెట్ (టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్) శాపంగా మారింది. పదోన్నతుల కోసం ఉపాధ్యాయులు ఏండ్లుగా ఎదురుచూస్తున్నారు. అయితే పదోన్నతులకు టెట్ తప్పనిసరి అనే నిబంధన విధించడంతో టీచర్లు ఆందోళన చెందుతున్నారు. గత 30 ఏండ్లుగా సేవలందిస్తూ పదవీ విరమణకు ఆరు నెలలు, సంవత్సరం గడువున్న ఎంతోమంది ఉపాధ్యాయులు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. అలాంటివారు టెట్‌లో ఉత్తీర్ణత సాధించడం అసాధ్యం. రాష్ట్రంలోని ప్రతి శాఖలోని ఉద్యోగులు పదవీ విరమణ నాటికే నాలుగైదు పదోన్నతులు పొందుతున్నారు. ఉపాధ్యాయులు మాత్రం ఏ క్యాడర్‌లో ఉద్యోగంలో చేరుతున్నారో అదే క్యాడర్‌లో పదవీ విరమణ చేస్తుండటం శోచనీయం.

మూడు దశాబ్దాలుగా ఎంతో మంది విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులకు టెట్‌ను అమలు చేయడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదు. ఎస్జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్, స్కూల్ అసిస్టెంట్ నుంచి ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందాలంటే టెట్ ఉత్తీర్ణత సాధించాలనే నిబంధన పెట్టడంతో ఉపాధ్యాయులు బెంబేలెత్తిపోతున్నారు. 50 ఏండ్లు పైబడిన వారు డిపార్ట్‌మెంట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించకపోయినా పదోన్నతులు ఇవ్వాలనే సడలింపు ఉందని టీచర్లు గుర్తుచేస్తున్నారు. ఆ సడలింపును అమలు చేసి న్యాయం చేయాలని కోరుతున్నారు. ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తూ ప్రాథమిక పాఠశాలల స్థాయి వేతనాలు తీసుకుంటూ భాషోపాధ్యాయులు శ్రమదోపిడీకి గురవుతున్నారు. పాలకులు మారుతున్నా ఈ పరిస్థితిలో మార్పు రావడం లేదు. జీవోలు వస్తున్నాయి.. పోతున్నాయి గానీ పదోన్నతులు మాత్రం దక్కడం లేదు.

టెట్‌లో భాషలకు 30 మార్కులను మాత్రమే కేటాయించారు. మిగిలినవారు తమతమ సబ్జెక్టుల్లో టెట్ ఉత్తీర్ణత సాధించాలనే నిబంధనలు ఉన్నాయి. భాషోపాధ్యాయులు సాంఘిక శాస్త్రంలో 60 శాతం మార్కులు తెచ్చుకోవాలనడం సమంజసం కాదు. ఏపీలో భాషా పండిత వ్యవస్థను రద్దు చేశారు. ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ టీచర్లు బోధించాలనే నిబంధన ఉంది. భాషా పండితులకు పేపర్- 111లో తెలుగు భాష, తెలుగు చరిత్ర, తెలుగు సంస్కృతి, తెలుగు సాహిత్యంలో 60 శాతం మార్కులకు టెట్ నిర్వహిస్తున్నారు. తెలంగాణలో మాత్రం ఆ నిబంధన లేదు. భాషోపాధ్యాయులకు ప్రత్యేక పేపర్ పెట్టాలని రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శికి, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్సీఈఆర్టీ) డైరెక్టర్‌కు వినతిపత్రాలు ఇచ్చినా ప్రయోజనం చేకూరలేదు.


ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల అంశం మూడు అడుగులు ముందుకు.. ఆరు అడుగుల వెనుకకు అన్నట్టుగా మారింది. పదోన్నతులు, బదిలీలనగానే వివిధ కారణాలను చూపుతూ ఉపాధ్యాయులు కోర్టులను ఆశ్రయిస్తున్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో హామీ ఇచ్చారు. ఉపాధ్యాయ సంఘాలతో సమావేశమై పదోన్నతులు, బదిలీలు చేపడతామని చెప్పారు. విద్యా శాఖను స్వయంగా చూస్తున్న సీఎం ఈ సమస్యకు త్వరగా పరిష్కారం చూపెడతారని ఉపాధ్యాయులు ఆశిస్తున్నారు.

---




---

# ఎటమటం



## మిస్ ఫైర్

ప్రాస కోసమో, పంచ్ కోసమో డైలాగులు పేల్చితే ఒక్కోసారి అవి గురితప్పి మిస్ ఫైర్ అవుతుంటాయి. అచ్చం అలాంటి పరిస్థితే ఎదుర్కొంటున్నారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి. మహబూబాబాద్ సిట్టింగ్ ఎంపీ మాలోతు కవితనే మళ్లీ అభ్యర్థిగా బీఆర్ఎస్ ప్రకటించింది. దీంతో ఒక సమావేశంలో ఆమెను శూర్పనఖతో పోల్చారు పొంగులేటి. కానీ, మంత్రి చేసిన వ్యాఖ్య గురితప్పి మాజీ కేంద్ర మంత్రి రేణుకా చౌదరికి తగిలింది. గతంలో ప్రధాని మోదీ పార్లమెంట్‌లో రేణుకాచౌదరిని శూర్పనఖతో పోల్చారు. అప్పట్లో ఆ వ్యాఖ్య వివాదాస్పదమైంది. శూర్పనఖ అనే పదాన్ని తాజాగా పొంగులేటి ప్రయోగించడంతో పాత ఘటనను తిరగదోడినట్టయింది. దీంతో మంత్రి వేసిన పంచ్ డైలాగ్ మిస్ ఫైర్ అయిందని సొంత పార్టీ వారే సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు.



## వాంటెడ్ క్యాండిడేట్స్

కేంద్రంలో బీజేపీ సర్కారే తిరిగి అధికారంలోకి వస్తుందని, గతంలో కంటే ఈసారి ఎక్కువ సీట్లు వస్తాయని బీజేపీ విస్తృతంగా ప్రచారం చేస్తున్నది. అయితే తెలంగాణలో మాత్రం ఆ పార్టీ విచిత్రమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నది. ఎన్నికల్లో ఆ పార్టీ తరపున పోటీ చేసేందుకు అభ్యర్థులు దొరకని పరిస్థితి నెలకొంది. 'హలో! మా పార్టీ నుంచి పోటీ చేయడానికి మీరేమైనా ఆసక్తిగా ఉన్నారా?' అంటూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి కొందరికి ఫోన్లు చేసి మరీ అభ్యర్థిస్తున్నారు. అంతేకాకుండా కొందరు నాయకుల ఇండ్లకు స్వయంగా వెళ్లి 'టికెట్ తీసుకోండి ప్లీజ్' అని అడుగుతున్నారు. హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి మాధవీలత అయితే తనను అభ్యర్థిగా ప్రకటించిన తర్వాతే బీజేపీ సభ్యత్వం తీసుకున్నారు. ఇతర రాష్ట్రాల్లో పరిస్థితి ఎలా ఉన్నా.. తెలంగాణలో ఏంటీ పరిస్థితి? అని పార్టీ పెద్దలు పెదవి విరుస్తున్నారట!



## ఇదీ మార్పే!

తెలంగాణలో సినిమా వాళ్లను ఏ పార్టీ కూడా దగ్గరికి రానీయడం లేదు. అసెంబ్లీ ఎన్నికల్లో జయసుధ, విజయశాంతి, కవిత, జీవిత, దివ్యవాణి, బండ్ల గణేశ్ తదితరులు టికెట్లు ఆశించినప్పటికీ ఎవరికీ పోటీ చేసే అవకాశం రాలేదు. తాజాగా పార్లమెంట్ ఎన్నికల్లోనూ అదే పరిస్థితి నెలకొంది. దీంతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సినిమా వాళ్లను పక్కనపెట్టడాన్ని అన్ని పార్టీలు పాటించడం నిజంగా మార్పే అంటున్నారు సినీ పండితులు.



## హమ్ హైనా!

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీయే మరో పదేండ్ల పాటు అధికారంలో ఉంటుందని మహబూబ్‌నగర్‌లో జరిగిన ప్రజాదీవెన సభలో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పుకొచ్చారు. అయితే అదే వేదికపై ప్రసంగించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాత్రం మరో ఇరవై ఏండ్లు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంటుందన్నారు. అదేంటి సీఎం రేవంత్‌రెడ్డి పదేండ్లు అంటుంటే.. మీరేమో 20 ఏండ్లు అంటున్నారని కోమటిరెడ్డిని పక్కన కూర్చున్న ఒక నేత అడగగా.. 'పదేండ్లు రేవంత్‌రెడ్డి ఉండి దిగిపోతే.. ఆ తర్వాత పదేండ్లు మేం ఉండొద్దా' అని గొణిగినట్టు వినికిడి.

- వెల్జాల